
# ఆరోగ్యసేవల కోసం దత్తత

- పేద కుటుంబాలను అడాప్ట్ చేసుకోనున్న మెడికల్ విద్యార్థులు
- ఒక్కో విద్యార్థి ఐదు ఫ్యామిలీల చొప్పన..
- ఆరోగ్య సమాచారాన్ని సేకరించి హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయనున్న మెడికోలు
- వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన
- అనారోగ్య సమస్యలుంటే మెరుగైన వైద్యానికి సిఫారసు
- ఈ నెలాఖరు నుంచి దత్తత కార్యక్రమం షురూ



వికారాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): గ్రామీణ ప్రాంతాల్లోని పేదల ఆరోగ్యంపై జిల్లా యం త్రాంగం దృష్టి పెట్టింది. చిన్న, చిన్న అనారోగ్య సమస్యలపై వారికి అవగాహన లేక ప్రాణాలపైకి తెచ్చుకుంటున్న పరిస్థితులు చాలా ఉన్నాయి. అయితే ప్రస్తుతం జిల్లాలో 20 గ్రామాలకు ఒక పీహెచ్‌సీతో పాటు 5-6 గ్రామాలకొక సబ్‌సెంటర్‌ను ఏర్పాటు చేసి, అవసరమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినా ఇంకా సద్వినియోగం చేసుకోని వారి సంఖ్య ఎక్కువగానే ఉన్నది. అయితే అనారోగ్య సమస్యలకు సంబంధించిన మూలాలను ముందే తెలుసుకుని గ్రామీణులకు అవసరమైన వైద్యాన్ని అందించడంతోపాటు వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం పేద కుటుంబాలను దత్తత తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టా రు. అయితే ఇటీవల జిల్లాలో ప్రారంభమైన ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ కోర్సులో చేరిన విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడితే.. విద్యార్థులకు వారి కోర్సు పూర్తయ్యే నాటికి వైద్యులుగా క్షేత్రస్థాయి అనుభవం రావడంతోపాటు గ్రామీణ ప్రాంతా ల్లో వైద్యారోగ్య ప్రాధాన్యత ఎంత మేర అవసరమనే దానిపైనా వారికి అవగాహన రానున్నది.

## ఒక్కో విద్యార్థికి ఐదు కుటుంబాల చొప్పన..



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులు ఒక్కొక్కరు ఐదు కుటుంబాల చొప్పున దత్తత తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈనెలాఖరు నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నది. వికారాబాద్ మండలంలోని రామయ్యగూడ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న కుటుంబాలను మెడికల్ కాలేజీ విద్యార్థులు దత్తత తీసు కోనున్నారు. ఇప్పటికే రామయ్యగూడ పీహెచ్‌సీ పరిధిలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది సర్వే నిర్వహించగా 500 కుటుంబాలున్నట్లు గుర్తించారు. అయితే వారు నిరాక్ష్యరాస్యతతో చిన్న, చిన్న సమస్యంటూ పట్టించుకోకుండా ప్రాణాపాయస్థితికి తెచ్చుకుంటున్నారు. వైద్యవిద్యార్థులు ముందు గా దత్తత తీసుకున్న కుటుంబాలను కలిసి సంబంధిత కుటుంబంలో ఎంతమంది సభ్యులున్నారు..?, ఒక్కొక్కరి వయస్సు ఎంత..?, బీపీ, షుగర్ ఇతర వ్యాధులేమైనా ఉన్నా యా అనే వివరాలను సేకరించి ప్రత్యేకంగా హెల్త్ ప్రొఫైల్‌ను తయారు చేయనున్నారు. దత్తత తీసుకున్న కుటుంబాల్లో ఎవరికైనా ఆరోగ్య సమస్యలుంటే సలహా లు, సూచనలివ్వడంతోపాటు సంబంధిత వ్యాధులకు వైద్యం కోసం హెల్త్ ఎడ్యుకేటర్స్ దగ్గరకు పంపించనున్నారు. ఈ విధంగా ప్రతి నెలాలో ఒకసారి దత్తత కుటుంబాల వద్దకు మెడికోలు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వైద్యులకు సమాచారం ఇవ్వనున్నారు. ప్రధానంగా మహిళలకు సంబంధించి ప్రెగ్నెన్సీ, రక్తహీనత, నెలవారీ టీకాలు, తల్లిపాల ప్రాముఖ్యత, పిడియాట్రిక్ తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య విద్యార్థులు అవగాహన కల్పించడంతోపాటు సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు.



## 500 కుటుంబాల దత్తత..

గ్రామీణ ప్రాంతాల పేదలకు ఆరోగ్య సూచనలు అందించాలని నిర్ణయించడం జరిగింది. ఇందుకోసం ప్రభుత్వ మెడికల్ విద్యార్థులు రామయ్యగూడ పీహెచ్‌సీ పరిధిలోని రామయ్యగూడలో ఉన్న ఐదు వందల పేద కుటుంబాలను 100 మంది వైద్య విద్యార్థులు ఒక్కొక్కరు ఐదు కుటుంబాల చొప్పున దత్తత తీసుకోనున్నారు. దత్తత తీసుకున్న కుటుంబాల ఆరోగ్య పరిస్థితిపై విద్యార్థులు ఇచ్చే సమాచారం మేరకు వైద్యులు తగు వైద్య సదుపాయాన్ని అందిస్తారు. **- పల్వన్‌కుమార్, వికారాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి**



## మంత్రి సీతక్కకు శుభాకాంక్షల వెల్లువ

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్కను శుక్రవారం చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు నగరంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభారత్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పాండూయాదవ్, నాగరాజు తదితరులున్నారు. **-చేవెళ్లటౌన్, డిసెంబర్ 15**



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీడబ్ల్యూవో లలితకుమారి

## దివ్యాంగులూ.. అన్ని రంగాల్లో రాణించాలి

- వికారాబాద్ డీడబ్ల్యూవో లలితకుమారి
- బ్లాక్‌గ్రౌండ్‌లో దివ్యాంగులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు

వికారాబాద్, డిసెంబర్ 15 : దివ్యాంగులు సాధారణ పౌరులతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణించాలని డీడబ్ల్యూవో లలితకుమారి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు బ్లాక్‌గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా లలిత కుమారి మాట్లాడుతూ దివ్యాంగులను జూనియర్స్ (10 నుంచి 16ఏండ్లు), సీనియర్స్ (17నుంచి 35 ఏండ్లు) రెండు విభాగాలుగా విభజించి షాట్‌పుట్, జావలిన్‌త్రో, రన్నింగ్, చెస్, క్యారమ్స్ తదితర ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని అవయవాలు సక్రమంగా ఉండే వ్యక్తులు సాధించే విజయాలకంటే.. ప్రతికూలతలను అధిగమించి అసమాన విజయాలను సాధించే దివ్యాంగులకే అధిక ప్రాధాన్యముంటుందన్నారు. దివ్యాంగులను వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గార్డియన్లు ప్రోత్సహించి ముందుకు నడిపించాలని సూచించారు. ఇలాంటి వేడుకలు నిర్వహించడం ద్వారా దివ్యాంగుల్లో ఆత్మస్థైరం పెరుగుతుందన్నారు. ప్రభుత్వం మహిళా, శిశు, సంక్షేమ శాఖ తరపున దివ్యాంగులకు అవసరమైన వసతులను కల్పిస్తూ వారిని అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నదన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులందరూ రాణించాలన్నారు. అనంతరం జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి హనుమంతరావు మాట్లాడుతూ దివ్యాంగులకు జిల్లాస్థాయి ఆటల పోటీలు నిర్వహించడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ అదనపు పీడీ నర్సింహులు, చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారులు ప్రియదర్శిని, జయరాంరేణుక, వెంకటేశ్వరమ్మ, సీనియర్ అసిస్టెంట్ జహీరుద్దీన్, పీఈటీలు, వికారాబాద్ జిల్లాకు చెందిన దివ్యాంగులు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ విభాగానికి చెందిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బృందం సభ్యులకు చందనవెల్లి పీహెచ్‌సీ వివరాలు చెబుతున్న రంగారెడ్డి డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

## రోగులకు అందుతున్న సేవలపై ఆరా

- చందనవెల్లి పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం
- వివిధ పథకాల ద్వారా రోగులు పొందుతున్న సౌకర్యాల పరిశీలన

షాబాద్, డిసెంబర్ 15 : మండలంలోని చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కేంద్ర బృందం సందర్శించింది. శుక్రవారం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ నిమిత్తం ఉత్తరప్రదేశ్ నుంచి డాక్టర్ రాజేశ్‌పటేల్, గుజరాత్ నుంచి డాక్టర్ శ్రీధర్‌రావు చందనవెల్లి దవాఖానను సందర్శించి పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలను ఆరా తీశారు. ఆస్పత్రి పరిసరాలను కలియదిరిగారు. వివిధ స్కీముల ద్వారా రోగులు పొందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందిస్తామని చెప్పారు. కాగా రంగారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు దవాఖానలో రోగులకు అందుతున్న సేవలను బృందం సభ్యులకు వివరించారు. అనంతరం అక్కడి నుంచి షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సెర్చ్ ఫౌండేషన్ ద్వారా షాబాద్ దవాఖానను కావాల్సిన మరమ్మతులు, తదితర విషయాలను సిబ్బందితో చర్చించారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి రోగుల సౌకర్యార్థం వసతులు కల్పించాలని వారు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్, సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు గోపాల్, నవీన్‌కుమార్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.